

ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

కొనసాగుతున్న ఎస్సారెస్పీ నీటి విడుదల

- ప్రాజెక్టులోకి 44వేల క్యూసెక్కుల నీరు చేరిక
- ప్రాజెక్టు ప్రధాన కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, సెప్టెంబరు 29: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 10 వరద గేట్ల ద్వారా 29వేల 678 క్యూసెక్కుల వరద నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈఈ వంశీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఎగువ ప్రాంతం మహారాష్ట్ర, విష్ణుపురి బలేగావ్, మంజీరల నుంచి వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ప్రధాన కాలువలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 44వేల 268 క్యూసెక్కుల వరదనీరు చేరగా వరద గేట్ల ద్వారా ప్రధాన కాలువల ద్వారా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటిని వచ్చినట్టు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం నిండు కుండల నిండి జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు నుంచి వరదకాలువ ద్వారా ఐదు వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 6,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 700 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500 క్యూసెక్కుల నీరు విడుదల జరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091. 00 అడుగులు (80.5 టీఎంసీ)లు కాగా, ఆదివారం సాయంత్రానికి 1091. 00 అడుగులు (80.501 టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు. 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి 217 టీఎంసీల నీరు చేరగా ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ప్రధానకాలువల ద్వారా 144 టీఎంసీల నీరు విడుదల చేశారు.



కొత్త మాస్టర్ ప్లాన్‌కు అడ్డంకులు!

- తమకు అనుకూల అంశాలు చేర్చాలని రియల్ ఎస్టేట్ వ్యాపారుల వినతి
- ప్రభుత్వ పరిశీలనలో కొత్త మాస్టర్ ప్లాన్
- ఔటర్ రింగ్‌రోడ్‌పై వ్యాపారస్తుల నజర్
- కొత్త మాస్టర్ ప్లాన్ లేకపోవడంతో పాత ప్లాన్ ద్వారానే అనుమతులు



నిజామాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ నగర మాస్టర్ ప్లాన్ మరింత ఆలస్యం కానుంది. ఏళ్లతరబడి ప్రయత్నాలు చేస్తున్నా ఇప్పటికీ కొలిక్కి రాలేదు. నుడా గ్రామాలతో కలిపి కొత్త మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన చేసిన ఇప్పటికీ వెలుగు చూడలేదు. వచ్చే 40ఏళ్లను దృష్టిలో పెట్టుకొని పెరిగే జనాభా ఆధారంగా డిజైన్ చేసినా ఇప్పటికీ అనుమతులు రాలేదు. ప్రజాభిప్రాయం సేకరణతో పాటు పలువురు నిపుణుల సలహాలు తీసుకున్నా ఫలితం మాత్రం లేదు. ఇప్పటికీ కొత్త మాస్టర్ ప్లాన్‌లో కొన్నింటిని మార్చాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ పెద్దలను కలిశారు. కొన్ని ప్రాంతాల్లో మార్పులు చేయాలని విజ్ఞప్తులు చేశారు. వారి వెంచర్లు ఉన్న ప్రాంతాల్లో తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అన్నీపూర్తై ఏడాదిన్నర క్రితమే మున్సిపల్ శాఖకు వెళ్లిన ఇప్పటివరకు మాత్రం అమలుకు నోచుకోలేదు. రింగ్‌రోడ్‌తో పాటు పలు అంశాలపై డిజైన్ చేసిన కొత్త మాస్టర్‌ప్లాన్ ఇప్పటికీ రాకపోవడంపై పాతమాస్టర్ ప్లాన్ ద్వారా అనుమతులను ఇస్తున్నారు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు.

1980 నుంచి మాస్టర్ ప్లాన్ అమలు

నిజామాబాద్ మున్సిపాలిటీలో ఉన్న సమయంలో 1980లో మాస్టర్ ప్లాన్ అమల్లోకి వచ్చింది. అప్పటి ప్లాన్‌నే ఇప్పటి వరకు కొనసాగిస్తున్నారు. నిజామాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా 2004లో ఏర్పాటుచేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్‌గా మార్చడంతో పట్టణ వైశాల్యం కూడా పెరిగింది. నగర కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత పలు గ్రామాలను కూడా కార్పొరేషన్ పరిధిలో విలీనం చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్లు,విద్యాసంస్థలు, మౌలిక వసతుల కల్పన, పరిశ్రమలు, పార్కులతోపాటు ట్రాఫిక్ కోసం బైపాస్ రోడ్లు, రింగ్ రోడ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇన్నర్ రింగ్‌రోడ్‌తో పాటు ఔటర్ రింగ్‌రోడ్ ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2017లో కొత్త మాస్టర్ ప్లాన్ కోసం నిర్ణయం తీసుకున్నారు. మొదట నగర కార్పొరేషన్ పరిధిలో ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో మాస్టర్ ప్లాన్ కోసం రూపకల్పన చేశారు. తర్వాత ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించారు. అప్పటి అధికారులతోపాటు ఆశాఖ మంత్రి నుడా గ్రామాలను కూడా కలిపి భవిష్యత్తు అవసరాల కోసం కొత్త మాస్టర్‌ప్లాన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. తదనంతరం నుడా పరిధిలో 75 గ్రామాలను చేర్చుతూ కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. ఈ మాస్టర్ ప్లాన్‌లో 120 ఫీట్‌లతో ఇన్నర్ రింగ్‌రోడ్, 200 ఫీట్‌లతో ఔటర్ రింగ్‌రోడ్ డిజైన్ చేసి కొత్త మాస్టర్ ప్లాన్‌ను సంవత్సరంన్నర క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. తర్వాత ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడం వల్ల ఇప్పటివరకు ఈ మాస్టర్ ప్లాన్ ఆమోదానికి నోచుకోలేదు. ఇప్పటికీ ప్రభుత్వ పరిశీలనలోనే ఉంది. కొన్ని మార్పులతో త్వరలోనే ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కొత్త మాస్టర్ ప్లాన్‌లో భారీ మార్పులు?

కొత్తమాస్టర్ ప్లాన్ త్వరలో ఆమోదానికి రానుండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వెంచర్లకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. వెంచర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొన్ని విద్యాసంస్థల జోన్, కొన్ని ఇండస్ట్రియల్ జోన్, కొన్ని రెసిడెన్షియల్ జోన్‌గా ఉండటంతో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. నగరం బాగా విస్తరించడం వల్ల ప్రస్తుతం ఉన్న బైపాస్ రోడ్‌ను పూర్తిస్థాయిలో విస్తరించాలని కోరినట్లు తెలుస్తోంది. ఒకవైపే ఉన్న ఈ రోడ్‌ను రెండవ వైపు విస్తరిం



చాలంటే అటవీశాఖ భూములు ఎక్కువగా ఉండటంతో అనుమతులు రావని ఇన్నర్ రింగ్‌రోడ్‌కు రెండవ వైపుకు పోనట్లు తెలుస్తోంది. ఆ వైపు ఎక్కువ భాగం అటవీ భూముల గుండా వెళ్లాల్సి ఉండటంతో కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి కావడంతో ఆలస్యమవుతుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మాస్టర్ ప్లాన్‌లో పొందుపర్చిన టన్నగా ఔటర్ రింగ్‌రోడ్ ఏర్పాటుకు ఎక్కువమంది రియల్ఎస్టేట్ వ్యాపారులు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. నుడా పరిధిలో ఎక్కువగా రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉండటంతో మాస్టర్ ప్లాన్‌లో అనుకూలమైన మార్పులు కోరుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం యధావిధిగా కొత్త మాస్టర్‌ప్లాన్‌ను ఆమోదించి నిర్ణయం తీసుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు

జిల్లాలో కొత్తమాస్టర్ ప్లాన్ లేకపోవడం, పాత మాస్టర్ ప్లాన్‌నే కొనసాగిస్తుండడంతో భవన నిర్మాణాలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. పాత మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగానే రోడ్లు, నిర్మాణాల కోసం టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులను ఇస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల నిబంధనలు ఉల్లంఘించి బహుళ అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇవేకాకుండా నిజామాబాద్ నగరం పరిధిలో పలు ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమించి నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇవే కాకుండా వాగులను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం చెరువులకు సంబంధించి బఫర్‌జోన్‌లు, ఫుల్ రిజర్వాయర్ లెవల్ వంటి నిబంధనలు పట్టించుకోకుండా నిర్మాణాలు చేశారు. పాత మాస్టర్ ప్లాన్‌లో ఇవి పొందుపర్చబడి ఉన్నా పట్టించుకోలేదు. నగరం పరిధిలో జనాభా బాగా పెరిగింది. వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంది. నగర కార్పొరేషన్‌గా మారిన ఈ ఇరవై ఏళ్లలో జనాభాతోపాటు వాహనాలు రెండింతలు అయ్యాయి. ప్రస్తుతం ఉన్న రోడ్లు సరిపోవడం లేదు. కొత్త మాస్టర్ ప్లాన్ వస్తే రోడ్లతో పాటు కొత్తగా వచ్చే వెంచర్లలో నిర్మాణాలు కూడా నిబంధనల మేరకు జరుగనున్నాయి. జిల్లా ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి కొత్త మాస్టర్ ప్లాన్‌కు అనుమతి ఇస్తే నగరం పరిధిలో నిర్మాణాలు కూడా నిబంధనల మేరకు జరిగే అవకాశం ఉంది. కొత్త మాస్టర్ ప్లాన్ ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారు. త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందన్నారు. కొత్త మాస్టర్ ప్లాన్ వస్తే నిర్మాణాలు సక్రమంగా జరిగే అవకాశం ఉంది.

తిరుపతి లడ్డూ కల్తీపై
జగన్ దిష్టిబొమ్మ దహనం

- జగన్మోహన్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి
- పార్లమెంటరీ మాజీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 29: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని నిజామాబాద్ పార్లమెంటరీ మాజీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు ఎంతో భక్తిగా కొలిచే తిరుమల శ్రీవారి లడ్డూలో జంతువుల నెయ్యితో తయారు చేసి అపవిత్రం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని అన్నారు. తిరుమల పుణ్యక్షేత్రాన్ని కాస్త టూరిస్టు ప్లేస్‌గా మార్చి అందినకాడికి దోచుకున్నారని అన్నారు. తిరుమల దేవస్థానం అందించే సేవల్లో ప్రతీదాంట్లో ధరలను పెంచి అన్యమతస్తులకు అధికారాన్ని అప్పగించడాన్ని తప్పుబట్టారు. అన్యమతస్తులను తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉంచరాదని డిమాండ్ చేశారు. వైవి సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి ప్రధాన పాత్రగా ఉంచి తిరుమల క్షేత్రాన్ని అపవిత్రం చేశారని అన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, అంబిక సత్యనారాయణ, బొబ్బ నర్సింహారావు, దంతాల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

పీసీసీ అధ్యక్షుడిని ఘనంగా ఆహ్వానిద్దాం..

- చరిత్రలో నిలిచిపోయేలా కార్యక్రమాన్ని నిర్వహిద్దాం
- విస్తృతస్థాయి సమావేశంలో నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 29: పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అక్టోబర్ 4న జిల్లాకు మొట్టమొదటి సారి వస్తున్న సందర్భంగా ఆయనను నిర్వహించే స్వాగత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ శ్రేణులంతా తరలిరావాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో అక్టోబర్ 4న నిర్వహించే బహిరంగ సభ, స్వాగత కార్యక్రమానికి సంబంధించి విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం జిల్లాకు ప్రత్యేకస్థానం మొదటి నుంచి కల్పిస్తూనే ఉందని జిల్లాకు చెందిన వ్యక్తి రెండవసారి పీసీసీ అధ్యక్షుడు కావడం జిల్లాకే గర్వకారణం అన్నారు. ఎన్ఎస్‌యూఐ నుంచి అంచెలంచెలుగా పీసీసీ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన మహేష్‌కుమార్‌గౌడ్ నియామకం కావడం కష్టానికి దక్కిన ఫలితం అన్నారు. జిల్లా కేంద్రంలో వచ్చేనెల 4న నిర్వహించే భారీ భహిరంగ సభకు రాష్ట్రానికి చెందిన మంత్రులు, ఏఐసీసీ నాయకులు వస్తున్నారని, కావున శ్రేణులంతా బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జిలు బాధ్యతగా తీసుకొని అధిక సంఖ్యలో నాయకులను, కార్యకర్తలను బహిరంగ సభకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ సభ ద్వారా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలం ఏంటో ప్రతిపక్షాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉనికి భవిష్యత్తుల్లో ప్రశ్నార్థకం అన్నారు. ఈ సందర్భంగా 51ఏళ్ల పాటు రాజకీయాల్లో కొనసాగుతున్న ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌ను నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, ఆర్మూర్, బాల్కొండ ఇన్‌చార్జిలు వినయ్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీ ఛైర్మన్ కాసుల బాల్‌రాజు, నాయకులు ముప్ప గంగారెడ్డి, ప్రేమలత అగర్వాల్, రత్నాకర్, దయాకర్ గౌడ్, రామర్తిగోపి, చంద్రకళ, ఉషా, చందు, సుభాష్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జియో అటెండెన్స్ మాయం!

- ప్రభుత్వ పాఠశాలల్లో కానరాని జియో అటెండెన్స్, బయోమెట్రిక్
- దుమ్మాలు కొడుతున్న ఉపాధ్యాయులు
- యేడాదిగా జియో అటెండెన్స్ బంద్



నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు29: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నిర్ణీత సమయాల్లో పాఠశాలలకు చేరేలా రూపొందించిన జియో అటెండెన్స్ గత ఏడాదికాలంగా లేకపోవడంతో ఉపాధ్యాయులు ఆడిందే ఆటపాడిందే పాటగా వ్యవహారం సాగుతోంది. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణల నేపథ్యంలో గతంలో జియో అటెండెన్స్‌తో పాటు బయోమెట్రిక్ విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేశారు. కాని గత అక్టోబర్ నుంచి పాఠశాలల్లో జియో అటెండెన్స్‌ను అమలు చేయడం లేదు. జిల్లావ్యాప్తంగా సుమారు 1200 ప్రభుత్వ పాఠశాలల్లో 5వేల వరకు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా కొంతమంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. బిజినెస్ టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జియో అటెండెన్స్‌ను అమలు చేసిన క్రమంలో కొంతమంది ఉపాధ్యాయులు దీనిని వ్యతిరేకించారు. సరిగ్గా ఏడాదిక్రితం ఎన్నికలకు ముందు కొన్ని ఉపాధ్యాయ సంఘాల ఒత్తిడిలతో జియోఅటెండెన్స్‌ను నిలిపివేశారు. కానీ అంతకుముందు ప్రభుత్వ పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరువిధానం అమల్లో ఉండేది. ఇప్పటికీ అనేక పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరుకు సంబంధించి పరికరాలు ఉన్నా వాటిని వినియోగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నా ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు మాత్రం రావడం లేదు. ఏదో తూతూ మంత్రంగా కొంత మంది ఉపాధ్యాయులు ఉదయం పూట పాఠశాలలకు వెళ్తూ మధ్యాహ్నం నుంచి డుమ్మాలు కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో జియో అటెండెన్స్‌ను అమలు చేసిన క్రమంలో అనేక మంది ఉపాధ్యాయులు పాఠశాలలకు నిర్ణీత సమయానికి వెళ్లారు. ఏడాది కాలంగా జిల్లాలో జియో అటెండెన్స్‌తో పాటు బయోమెట్రిక్ విధానం అమలు కాకపోవడంతో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం ఉపాధ్యాయుల హాజరు విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరిస్తే తప్ప మార్పులు జరిగే అవకాశం లేదు.

బిజినెస్ టీచర్ల డుమ్మా

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాల పేరుతో, కొంత మంది ఉపాధ్యాయులు ప్రైవేటు బిజినెస్‌చేస్తూ పాఠశాలలకు డుమ్మాలు కొడుతున్నారు. ప్రభుత్వం ద్వారా ప్రతీనెల లక్షలాది రూపాయల జీతాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు పాఠశాలలకు డుమ్మాలు కొడుతూ ఇతర వ్యాపకాలను నిర్వహిస్తున్నారు. సొంత వ్యాపారాలు, ఆదరణకు ఆదాయం వచ్చే బిజినెస్‌లపై దృష్టి పెడుతున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు రియల్ ఎస్టేట్ రంగంతోపాటు ఇన్సూరెన్స్‌లు, వడ్డీవ్యాపారాలు, చిట్టీలు నిర్వహిస్తున్నారు. దీంతో పాఠశాల పనులను పక్కనబెట్టి సొంత వ్యవహారాలను నిర్వహించేందుకే ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఏదో ఉదయం పూట పాఠశాలలకు వెళ్లి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి బయట ఇతర వ్యాపకాలను నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో ఉన్న ఇతర ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను మచ్చిక చేసుకొని తాము చెప్పిందే వేదంగా వ్యవహారాలను నడుపుతున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాల పేరుతో పాఠశాలలకు డుమ్మాలు కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సంఘ నేతల పెత్తనం

విద్యాశాఖలో ఉపాధ్యాయ సంఘాలనాయకులదే పెత్తనం నడుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలకు ఉపాధ్యాయ సంఘాల నేతలు డుమ్మాలు కొడుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘాల పేర్లు చెప్పి అసలు బడి మొఖమే చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది ఉపాధ్యాయులు నిత్యం మండల విద్యాశాఖ కార్యాలయాల చుట్టే తిరుగుతూ తమ సొంత పనులను నిర్వహిస్తూ బడులకు ఎగనామం పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో అమలు చేసిన బయోమెట్రిక్ హాజరువిధానం, జియోఅటెండెన్స్ విధానాన్ని తిరిగి అమ లు చేస్తే తప్ప డుమ్మా టీచర్లు, సంఘ నాయకులు దారిలోకి వచ్చే అవకాశం లేదు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం

- దుర్గాప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి



ఉపాధ్యాయులు పాఠశాలలకు గైర్హాజరు అవుతున్నారనే విషయంలో ఫిర్యాదులు వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో జిల్లాలో జియో అటెండెన్స్, బయోమెట్రిక్ అటెండెన్స్‌ను అమలు చేశాం. కానీ రాష్ట్రవ్యాప్తంగా జియోఅటెండెన్స్ అమలు చేయడం లేదు. జియో అటెండెన్స్, బయోమెట్రిక్ హాజరుపై రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయం ప్రకారం నడుచుకుంటాం. అయినప్పటికీ జిల్లాలో ఎక్కడ కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలకు గైర్హాజరైన, ఇతర వ్యాపకాలు, వ్యాపారాలు నిర్వహించిన తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

జియో అటెండెన్స్ అమలు చేయాలి

- గంగాధర్, యూటీఎఫ్ నాయకులు



గతంలో జిల్లాలో జియో అటెండెన్స్‌ను అమలు చేసినప్పుడు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరయ్యారు. దానివల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరిగింది. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలన్నా, విద్యాబోధన అందరికీ అందాలన్నా ఖచ్చితంగా బయోమెట్రిక్ విధానం లేదా జియో అటెండెన్స్‌ను అమలు చేయాలి.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన సునీల్ కుమార్

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 29: మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మరణించిన బాధిత కుటుంబాలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. హసాకొత్తూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు న్యాయవాది ఏలేటి గంగాధర్ తల్లి గంగవ్వ శనివారవ గుండెపోటుతో మరణించగా ఆదివారం ఆయాన బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. చౌట్‌పల్లి లో సత్యనారాయణ కుటుంబా న్ని, నర్సాపూర్‌లో ఆర్‌ఎంపీ జనార్ధన్ మరణించడంతో ఆయన కుటుంబసభ్యులను, అదేగ్రామానికి చెందిన సుధాకర్ మరణించ డంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆయన వెంట ఏఎంసీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్‌ఛైర్మన్ సుంకెట బుచ్చన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, పడిగెల ప్రవీన్ , రేవతి గంగాధర్, వేములు గంగారెడ్డి, లింగారెడ్డి, సంజీవ్ యాదవ్, ఉన్నారు.

ఉచిత కంటి, దంత వైద్య శిబిరం



కోటగిరిలో కంటివైద్య శిబిరం

కోటగిరి, సెప్టెంబరు 29 : మండల కేంద్రంలోని పోచారం కాలనీలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్, రవి యువజన సేన ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య శిబిరంలో 80మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 10మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్స నిమిత్తం బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. మరో పది మందికి కంటి అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. పలువురికి దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు ఇర్ఫాన్ అలీ, లయన్స్ క్లబ్ సభ్యులు రవి, హన్మంత్ రావు, సంతోష్, మాజీ సర్పంచ్ స్వరూప, నాయకులు సాయిరెడ్డి, అనంత్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు

బోధన్‌రూరల్, సెప్టెంబరు 29: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని సార్వజనిక్ దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు తాడుమహేష్ మాట్లాడుతూ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, నిమజ్జన ఉత్సవాలలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజుల పవన్ కుమార్, శ్యామ్, ఐరేండ్ల రాజు, తదితరులున్నారు.

అమీనాపూర్‌లో కుల నిర్మూలన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి బి.దేవరాం

వేల్పూర్, సెప్టెంబరు 29 : మహాత్మ సావిత్రిబాయిపూలే సమాజమార్పు కోసం కులాలు లేని నవసమాజం, అంతరాలు లేని వ్యవస్థ కోసం పోరాడారని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.దేవరాం అన్నారు. ఆదివారం వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామంలో మహాత్మజ్యోతిరావుపూలే ఏర్పాటు చేసిన సత్యశోదక్ సమాజ్ నేటికి 152ఏళ్లు కావస్తున్న సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ ఆధ్వర్యంలో గ్రామంలో కులనిర్మూలన సదస్సు నిర్వహించారు. సదస్సుకు సబ్‌డివిజన్ నాయకులు రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి దేవరాం హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి దేవరాం, డివిజన్ నాయకులు రాజేశ్వర్, రాజన్న, అర్వింద్, రామన్నపేట్ అంబేద్కర్ సంఘం గ్రామప్రధాన కార్యదర్శి బాబురావు, అమీనాపూర్ మాజీసర్పంచ్ రాజేశ్వర్, నాయకులు ఈరవేణి గణేష్, సత్యం, అమోష్, రాజుగౌడ్, గంగాధర్, సురాజ్, ఇస్తారి రాజు, జ్యోతి, స్వరూప, పద్మ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీని కలిసిన ఎస్సైలు, సీఐలు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 29: పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో నూతన ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిని ఆదివారం ఎస్సైలు, సీఐలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఏసీపీ బస్వారెడ్డి అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై వెళ్ళడంతో హైదరాబాద్ సీఐడీ విభాగంలో ఏసీపీగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్‌రెడ్డి బదిలీపై ఆర్మూర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించడంతో రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, భీమ్‌గల్ సీఐ నవీన్, ఆర్మూర్ సీఐ రవికుమార్‌లతో పాటు డివిజన్‌లోని ఎస్సైలు హరిబాబు, నాగనాథ్, రజనీకాంత్, నారాయణ, నరేష్, విక్రంలు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

● బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 29: రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి ప్రతీ కార్యకర్త కృషిచేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి పోతంకర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అసెంబ్లీ కన్వీనర్‌లుగా ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జెస్సుఅనిల్‌కుమార్, బాల్కొండ నియోజకవర్గం నుంచి ఏలేటి మల్లికార్జున్‌లతో పాటు మండల ఇన్‌చార్జీలను నియమించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మైనారిటీ మోర్చ జిల్లా అధ్యక్షుడు ఎండిఖైజార్, పొల్కం వేణు, దోండి ప్రకాష్, పులి యుగంధర్, బాశెట్టి రాజ్‌కుమార్, కలిగోట ప్రశాంత్, మీర్యాల్‌కార్ కిరణ్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో కోటగిరి విద్యార్థుల ప్రతిభ

కోటగిరి, సెప్టెంబరు 29: కోటగిరి మైనార్టీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. జిల్లాస్థాయి జావెలిన్‌త్రో ఈవెంట్‌లో కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీహరి ప్రథమ స్థానంలో నిలిచారు. నిజామాబాద్ నాగారంలోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థి ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. వచ్చే నెల 7, 8తేదీల్లో వరంగల్ జిల్లా హన్మకొండలో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడ పోటీల్లో అతనికి చోటు లభించింది. జూనియర్ విభాగంలో జావెలిన్ త్రోలో ఎండీ.అయాన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. తమ కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ మొబిన్‌తో పాటు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

'బాధితులకు అండగా ఉంటాం'

ఏర్గట్ల, సెప్టెంబరు 29: మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కౌడ భూమేశ్వర్ సోదరుడు కౌడ భూమేష్ కిడ్నీ సమస్యతో అనారోగ్యంతో పాలుకాగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని పాలెం గ్రామంలో పలు బాధిత కుటుంబాలను ఆదివారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఏలేటి ప్రవీణ్ పెద్దనాన్న చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అంతేగాక కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిప్పెర నాగన్న భార్య చనిపోవడంతో వారి కుటుంబాన్ని, నవీన్ చనిపోవడంతో వారి కుటుంబాన్ని సునీల్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల రాములు, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలెపు నర్సయ్య, స్థానిక కాంగ్రెస్ నాయకులు బద్దం గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌వోకు పాముకాటు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 29: పట్టణంలోని మహాలక్ష్మీకాలనీలో ఎస్‌హెచ్‌వో రవికుమార్‌కు పాము కాటు వేసింది. శనివారం రాత్రి విధులు నిర్వహించిన ఎస్‌హెచ్‌వో రవికుమార్ వాకింగ్ చేస్తుండగా పాము కాటు వేయడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

టెన్నికాయిట్ పోటీలకు పడకల్ విద్యార్థి ఎంపిక

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు29: జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు మండలంలోని పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న గోసంగి రితిక్ ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. జమ్ముకాశ్మీర్‌లోని గాంధీనగర్‌లో నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో రితిక్ పాల్గొంటారని తెలిపారు. ఆర్మూర్‌లో మినీస్టేడియంలో ఈనెల 1తేదీ నుంచి 3వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో రితిక్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందున జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రితిక్‌ను రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేట్ సెక్రెటరీ సుందర్ రితిక్‌ను అభినందించారు.

మండల క్రీడల్లో ఓవరాల్ చాంపియన్‌గా చౌట్‌పల్లి పాఠశాల



విజేతలతో కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 29: ఈ నెల 26 నుండి 28 వరకు కమ్మర్‌పల్లి మినిస్టేడియంలో నిర్వహించిన కమ్మర్‌పల్లి అంతర్ పాఠశాల క్రీడోత్సవాలలో అన్ని ఇవెంట్లలో క్రీడాప్రతిభను కనబర్చి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను మండలంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాల దక్కించుకుంది. ఈ క్రీడల్లో మార్చ్‌ఫాస్ట్ మొదలుకొని అన్నివిభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో విచయం సాదించి మొత్తం 10 షీల్డ్‌లను కైవశం చేసుకుని ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. కాగా మండలకేంద్రంలోని శ్రీవిద్యాసాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు మండలస్థాయి క్రీడల్లో అసమాన క్రీడాప్రతిభను కనబర్థ ప్రత్యర్థిజట్లపై విజయాలు సాదిస్తు అన్ని ఇవెంటల్లలో విజయకేతనాన్ని ఎగురవేశారు. అటోర్నిలో మార్చ్‌ఫాస్ట్ మొదలు మొత్తం 8 షీల్డులు చేజిక్కించుకున్నారు. ఆదివారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి క్రీడాకారులను అభినందించారు.

అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల విజేతలు

కబడ్డి జూనియర్ బాయ్‌స్ ప్రథమ బషీరాబాద్, ద్వితీయ కోనాసమందర్, తృతీయ శ్రీవిద్యాసాయి. జూనయర్ బాలికల విభగంలో ఫస్ట్ బషీరామాద్, సెక్డండ్ ఎస్‌వీఎస్, థర్డ్ కేజీబీవీ. జబ్ జూనియర బాయ్‌స్ ఫస్ట్ బషీరాబాద్, సెక్డండ్ చౌట్‌పల్లి, థర్డ్ కోనసమందర్. సబ్‌జూనియర్ బాలికలవిభాగంలో ఫస్ట్ చౌట్‌పల్లి, సెకండ్ హాసాకొత్తూర్, థర్డ్ కోనాసమందర్, ఖోఖో జూనియర్ బాయ్‌స్ ఫస్ట్ ఎస్ఎస్‌వీ, కోనాసమందర్, తర్డ్ విజ్ఞానజ్యోతి. గల్స్‌విభాగం లో ఫస్ట్ జేడ్పీహెచ్ఎస్ కమ్మర్‌పల్లి, సెక్డండ్ జేడ్పీహెచ్ఎస్ చౌట్‌పల్లి, థర్డ్ ఎస్‌వీఎస్ కమ్మర్‌పల్లి. సబ్ జూనియర్ బాయ్‌స్‌లో ఫస్ట్ చౌట్‌పల్లి, సెకండ్ కోనాసమందర్, థర్డ్ హసాకొత్తూర్. బాలికలవిబాగంలో ఫస్ట్ చౌట్‌పల్లి, సెకండ్ కోనాసమందర్, థర్డ్ హసాకొత్తూర్. ఓవరాల్ చాంపీయన్‌గా జేడ్పీహెచ్ఎస్ చౌట్‌పల్లికి దక్కింది.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయి

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే

భీమ్‌గల్, సెప్టెంబరు 29: క్రీడలు ఆత్మ విశ్వాసం, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని కృషి హైస్కూల్ స్టేడియంలో ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ మండల అంతర పాఠశాల క్రీడలను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన మార్చ్‌ఫస్ట్ ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులకు ప్రేరణగా తీసుకొని క్రీడల్లో ముందుకెళ్లాలని, ఇవి మానసికోల్లాసానికి దేహదారుడ్యానికి దోహదం చేస్తాయన్నారు. జిల్లాలోని పలు పాఠశాలలకు బెంచీలు, కంప్యూటర్‌లు, క్రీడా పరికరాలు అందజేస్తూ క్రీడలను ప్రొత్సహిస్తున్న వ్యాపారవేత్త దయానంద్‌రెడ్డిని, క్రీడలకు అతిథ్యమిస్తున్న కృషి హైస్కూల్ యాజమాన్యాన్ని అభినం దించారు. పాఠశాలల మార్చ్‌ఫస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరిం చాయి. మార్చ్‌ఫస్ట్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోం టోలు అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎంఈవో స్వామి, పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు ఎడ్ల శేఖర్, టీ ఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు కన్నె సురేందర్, కృషి హైస్కూల్ కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజం

● పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి



సన్మానిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి

రెంజల్, సెప్టెంబరు 29: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. రెంజల్, నవీపేట మండలాల ఎంఈవోగా విధులు నిర్వహించిన గణేష్ రావు పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మోహన్ రెడ్డి గణేష్‌రావును శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈవోగా గణేష్ రావు ఎటువంటి ఇబ్బందులు రానివ్వకుండా సేవలందించారని, ఆయన సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఆంజనేయులు, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, నర్సింహరె డ్డి, తాహెర్, శ్రీనివాస్ రెడ్డి, శంకర్, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఊర పండుగ

మోస్రా,సెప్టెంబరు 29: మండలంలోని మోస్రా, తిమ్మాపూర్ గ్రామాల్లో ప్రతి సంవత్సరం దసరా పండుగకు ముందు ఆనవాయితీగా ఊర పండుగను జరుపుతారు. ఈ సందర్భంగా మోస్రా గ్రామ కమిటీ సభ్యులు, తిమ్మాపూర్ గ్రామ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో చెడును ప్రళదోలడానికి ఈ గ్రామ దేవతల పండుగను పెద్దలు జరిపే వారు అదే ఆనవాయితీగా జరుపుతున్నాం. ఈ కార్యక్రమంలో మోస్రా, తిమ్మాపూర్ గ్రామాల ఆయా కుల సంఘాల అధ్యక్షులు, గ్రామ కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు, యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : మండల కేంద్రంలోని నవీపేట, దర్యాపూర్ రెవెన్యూ గ్రామాలలో ఆదివారం ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఊర పండుగ ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన ఆదివారం ఉత్సవాలు ముగిశాయి. శనివారం అర్ధరాత్రి నుండి ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహలక్ష్మి, పోచమ్మ, మైసమ్మ, ఐదు చేతుల పోచమ్మ, ఊరడమ్మ వంటి గ్రామ దేవతలకు పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన పందిరి కింద గ్రామ దేవతలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయం గ్రామ దేవతలకు మేకపోతులు, గొర్రెలను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వీడీసీ సభ్యులు, పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని రెంజల్, బోర్గాం, దూపల్లి గ్రామాలలో ఆదివారం ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. గ్రామాల్లోని గ్రామ దేవతల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో డప్పువాయిద్యాల మధ్య గ్రామ దేవతల వద్దకు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు. ప్రతి యేటా గ్రామంలో బోనాల పండుగను నిర్వహించడం జరుగుతుందని, గ్రామంల్లోని పాడిపంట చల్లగా ఉండాలని బోనాల పండుగను నిర్వహించడం జరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాయిరెడ్డి, సంతోష్, లక్ష్మణ్, గొజ్జ రమేష్, ఒడ్డెన్న, రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు షాక్ తగిలి కౌలు రైతుమృతి



మృతి చెందిన కౌలు రైతు పోశెట్టి

ఎడపల్లి, సెప్టెంబర్ 29 : మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులో విద్యుత్ షాక్ తగిలి కౌలురైతు మృతి చెందిన సంఘటన జరిగింది. రామన్నగారి సాయికుమార్ పొలాన్ని కుంటి పోశెట్టి అనే కౌలు రైతు కౌలుకు తీసుకుని వ్యసాయం చేస్తున్నాడు. పందుల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి పొలం చుట్టూ విద్యుత్ తీగలు అమర్చగా, ఆదివారం పంటపొలానికి వెళ్లిన పోశెట్టికి కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు.

కుస్తీపోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ

రుద్రూరు, సెప్టెంబరు 29 : రుద్రూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు కుస్తీ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సొంతం చేసుకుని, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 28న మంచిప్పలో జరిగిన పోటీల్లో పాఠశాల విద్యార్థినులు ఎస్.విజయశ్రీ, జి.సువేణిలు జిల్లాస్థాయిలో గోల్డ్‌మెడల్ సొంతం చేసుకున్నారు. అదేవిధంగా రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ ప్రదర్శిస్తున్న ఎస్.విజయశ్రీని, జి. సువేణిలను ఇంచార్జి ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట శ్రీనివాస్, పాఠ శాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. కాగా అదే పాఠశాలలో సీఆర్‌పీగా విదులు నిర్వహిస్తున్న విద్యార్థిని విజయశ్రీ తండ్రి అంబ ర్‌సింగ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ఎంఈవో కట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ మా పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికకావడం గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా సభ్యత్వ నమోదు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు29: జిల్లాలో లక్ష్యానికి మించి బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి అన్నారు. ఆదివారం జక్రాన్‌పల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేయించడంలో చురుకుగా పని చేయాలని, ప్రతీ బూత్ అధ్యక్షుడు మండల ముఖ్య నాయకులు దిశ నిర్దేశం చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బాగస్వాములను చేయాలని సూచించారు. గ్రామంలో ఉన్న సమస్యల విషయమై బీజేపీ నాయకులు కన్నెపల్లి ప్రసాద్ ప్రస్తావించగా వాటి పరిష్కారానికి ఎంపీ ధర్మపురి అర్వింద్ దృష్టికి తీసుకువెళ్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, బీజేపీ నాయకులు కిషన్‌నాయక్, మోహన్‌నాయక్, సంజీవ్‌గౌడ్, కన్నెపల్లి ప్రసాద్, జీవన్, అమర్, కార్తిక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్



కోటగిరిలో మాట్లాడుతున్న విండో అధ్యక్షులు

కోటగిరి,సెప్టెంబరు 29: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు సన్న ధాన్యానికి ప్రతి క్వింటాకు 500రూపాయల బోనస్ ఇవ్వాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. కోటగిరి మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘం 81వ మహాజన సభ విండో అధ్యక్షులు కూచి సిద్దు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడాదిలో జరిగిన లావాదేవీలు, జమ, ఖర్చులు, వ్యాపార లాభనష్టాలను వివరించారు. 2023-24 ఆడిట్ రిపోర్ట్‌ను ఆమోదించారు. సంఘం కార్యాలయం చుట్టు ప్రహారి నిర్మాణంతో పాటు పాత కార్యాలయాన్ని మరమ్మత్తు చేసేందుకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా విండో అధ్యక్షులు సిద్దు మాట్లాడుతూ రెండు లక్షల రుణమాఫీని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షులు గజేందర్, డైరెక్టర్‌లు సాయిరెడ్డి, లక్ష్మి, నాయకులు బీర్కూర్ గంగాధర్, మల్లికార్జున్, మోహన్ రావు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు


బోధన్‌రూరల్ : రైతుల పంట పొలాల కొనుగోలుపై ప్రభుత్వం 500రూపాయల బోనస్ అందించాలని రైతు మహాజన సభలో తీర్మానించారు. ఆదివారం సాలూర మండలంలోని హున్స గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో మహాజన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహజన సభలో రైతులు పలు తీర్మానాలను చేశారు. ఈ సందర్భంగా మహజన సభలో రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం పంట కొనుగోలులో రైతులు గిట్టుబాటు ధర కోసం 500 రూపాయల బోనస్‌ను అందించాలన్నారు. రెండు లక్షల రుణమాఫీ కాని రైతులకు ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీని చేయాలన్నారు. రైతుబంధు పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. మహజన సభలో పలు అంశాలను రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో హున్స సొసైటీ చైర్మన్ మందర్నా రవి, ఉపాధ్యక్షులు క్యూల కర్ణి వినోద్ రావు, పాలకవర్గ సభ్యులు సంజీవ్ కుమార్, రమేష్, సిద్ధార్థ్, ఖాజాపూర్ అశోక్, మైసయ్య, సీఈవో ముద్ద ఈర్వంత్ రావులతో హున్స, మందర్నా, ఖాజాపూర్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ఎన్నికల ప్రణాళికలో ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు రైతుల సన్న, దొడ్డు ధాన్యానికి 500రూపాయల బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని, తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని (ఏఐపీకేఎస్) అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. ఆదివారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు మొదటి వారం నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ముందు చూపుతో ప్రభుత్వం నిర్ణయాన్ని హర్షిస్తున్నామన్నారు. 60లక్షల 39వేల ఎకరాలలో వరిసాగు చేయబడిందని దొడ్డు ధాన్యం, సన్న ధాన్యానికి ప్రభుత్వం 500రూపాయల బోనస్ చెల్లించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా దొడ్డు, సన్న ధాన్యాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. వర్షంలో తడిసిన పత్తి, ధాన్యం ఎలాంటి కొరివి లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు.

విశ్వబ్రాహ్మణ యువజన సంఘం నూతన కార్యవర్గం

ఏర్గట్ల, సెప్టెంబరు 29: మండల కేంద్రంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ యువజన నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా రాజారపు నర్సయ్య, క్యాషియర్‌గా పరికిపండ్ల నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యువజన సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఏర్గట్ల పాఠశాలకు బాల చెలిమి గ్రంథాలయం



ప్రవీణ్‌శర్మకు పుస్తకాలు అందజేస్తున్న రియాజ్, వేదకుమార్

ఏర్గట్ల, సెప్టెంబరు 29: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమీ అలాగే బాల చెలిమి ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నట్లు పాఠశాల తెలుగు పండితులు ప్రవీణ్‌శర్మ తెలిపారు. రాష్ట్రంలో ఎన్నుకోబడిన పాఠశాలలో గ్రంథాలయాల ఏర్పాటులో భాగంగా ఏర్గట్ల పాఠశాలకు సుమారు 30 వేల నుండి 40 వేల నగదు విలువైన పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు కానుందని, అందులో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అప్పటికప్పుడు కొన్ని పుస్తకాలను రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమీ, బాల చెలిమి గ్రంథాలయ నిర్వాహకులు మణికొండ వేదకుమార్‌లు అందజేసినట్లు ప్రవీణ్ శర్మ తెలిపారు.

రెంజర్లలో మహాజన సభ



లావాదేవిలను చదివి వినిపిసవ్తున్న కార్యదర్శి గంగాధర్

ముప్కాల్, సెప్టెంబరు 29: మండల రెంజర్ల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ అధ్యక్షతన ఆదివారం మహాజన సభ నిర్వహించారు. సభలో సొసైటీ కార్యదర్శి గంగాధర్ సొసైటీ లావాదేవీలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా సొసైటీలో సరిపడ ఎరువులను సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ ముస్కుసంతోష్, డైరెక్టర్‌లు మేడిపల్లి ముత్తెన్న, సామ రాజేందర్, రాజన్న, క్యాతం గంగారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత రక్తపరీక్ష శిబిరం



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ముప్కాల్, సెప్టెంబరు 29: ముప్కాల్ మండల కేంద్రంలో ఉచిత రక్తపరీక్ష శిబిరం నిర్వహించారు. ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తపరీక్ష శిబిరాన్ని ఎస్సై రజనీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు శిబిరంలో రక్త పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు గంగాధర్, గోపిరాం, జక్కుల ప్రవీణ్‌కుమార్, గోపినాథ్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై పర్యాటకుల సందడి



ప్రాజెక్టుపై పర్యాటకుల రద్దీ

మెండోర, సెప్టెంబరు 29: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అందాలను తిలకించడానికి పర్యాటకులు ఆదివారం బారులు తీరారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిండుకుండలా నిండి జలకళను సంతరించుకోవడంతో ప్రాజెక్టు వరదగేట్లను ఎత్తడంతో ప్రాజెక్టు సుందర దృశ్యాలను చూడడానికి సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రాజెక్టు వరద గేట్ల నీటి విడుదల దృశ్యాలను పర్యాటకులు తమ సెల్‌ఫోన్‌లలో సెల్ఫీలు దిగుతూ బంధించారు. తమ కుటుంబసభ్యులతో వచ్చి ఆడుతూ పాడుతూ సందడి చేశారు. ప్రాజెక్టుపై పర్యాటకులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై నారాయణ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పిచ్చిమొక్కల తొలగింపు



చెత్తచెదారాన్ని తొలగిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 29: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఒకటో లైన్‌లో రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కలు, రోడ్డుపై ఉన్న చెత్తచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, కొక్కెర భూమన్న, ఎల్‌టి.కుమార్, ఎర్ర భూమయ్య, గడ్డం శంకర్, సాయన్న, రవి, జీవన్, గోపి, పతంజలి జయారజ్, రాజు, నిశాంత్, తదితరులు పాల్గొన్నారు.

'కులరహిత సమాజం కోసం పోరాడుతాం'

మాక్లూర్, సెప్టెంబరు29: భారతదేశంలో కుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించినప్పుడు దేశం పురోగతి చెందుతుందని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. ఆదివారం మండలంలోని బోర్గం(కె) గ్రామంలో మహాత్మ జ్యోతిబాపూలే సత్యశోదక్ సమాజ్ సంస్థను స్థాపించిన తర్వాత అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆయనకు నివాళులు అర్పించి కార్యక్రమం నిర్వహించారు. మాహాత్మజ్యోతిబాపూలే 152ఏళ్ళ క్రితం సత్యశోదక్ సమాజ్ స్థాపించి దేశంలో కుల నిర్మూలనకై అనేక కార్యక్రమాలు స్థాపించారు. బ్రాహ్మణీయ బావజలం మనదేశంలో రోజురోజుకు పెరుగుతుందే తప్ప తగ్గడంలేదని, కులంతర వివాహాలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు పరువుల పేర హత్యలు చేస్తున్నారాన్నరు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కుల నిర్మూలనకై పాటుపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు కృష్ణగౌడ్, నిజామాబాద్ డివిజన్ ప్రధానకార్యదర్శి జైశెట్టి రాధ, నాయకులు రాజు, స్నేహిత, గంగాధర్, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి'

పెద్దబజార్, సెప్టెంబరు 29 : ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దండివెంకట్, సిద్ధిరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని శివాజీనగర్‌లో గల బీఎల్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న బహుజన కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కనీస వేతనాలు అమలు చేయడంలో వివక్ష చూపుతుందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక 11 సంవత్సరాలుగా కార్మిక వర్గానికి రక్షణ కవచంగా ఉన్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి బహుజన శ్రామిక వర్గాన్ని పెట్టుబడిదారులకు కట్టుబానిసలుగా మార్చిందని ఆరోపించారు. అక్టోబర్‌లో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎల్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్, గంగాశంకర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

వృద్ధుల దినోత్సవానికి హాజరు కావాలి

పెద్దబజార్, సెప్టెంబరు 29: అక్టోబర్ 1న ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం న్యూ అంబేద్కర్ భవన్‌లో ఉదయం 11 గంటలకు సీనియర్ సిటీజన్స్‌డే వయో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సంక్షేమ శాఖ, వయోవృద్ధుల శాఖ, దివ్యాంగుల శాఖ, ట్రాన్స్‌జెండర్స్ శాఖ అధికారి రసూల్‌బీలు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సిటిజన్ సభ్యులైన ఆల్ పెన్షనర్స్ తప్పకుండా హాజరుకావాలని కోరారు.

పాలకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలి : సీపీఎం

పెద్దబజార్, సెప్టెంబరు 29: కష్టజీవుల రాజ్యం ఏర్పడితేనే పేదల సమస్యలు తీరుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం నగరంలోని బహుజన కాలనీలో సీపీఎం పార్టీ మహాసభ సందర్భంగా కాలనీవాసులతో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కానీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కానీ పేద ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు జరపడంలో ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో ప్రజల ఆదాయం పెరగకపోవడంతో పేదరికం మరింత పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుజాత, రజ్య, పద్మ, రిజ్వాన్, పర్విన్, అలిబాయ్ పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య శిబిరం

సిరికొండ, సెప్టెంబరు 29 : తూంపల్లి కేంద్రంగా నిర్వహిస్తున్న హెల్పింగ్ హార్ట్స్ సేవలు అద్భుతంగా ఉన్నాయని సిరికొండ ఏఎస్సై బాల్‌సింగ్ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మండలంలోని తూంపల్లి గ్రామంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలోఉచిత ఆరోగ్య శిబిరం జరిగింది. శిబిరంలో కంటి ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులను అందించారు. ఏఎస్సై బాల్‌సింగ్ మాట్లాడుతూ హెల్పింగ్‌హార్ట్స్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజలను ఆలోచింపచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ సొసైటీ అధ్యక్షులు శ్రీకాంత్, వీడీసీ చైర్మన్ లక్ష్మన్‌గౌడ్, మోహన్, సభ్యులు, రాజేందర్, వినోద్, రాజు, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ముదక్‌పల్లిలో ఘనంగా ఊర పండుగ

మోపాల్, సెప్టెంబరు 29: మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఊరపండుగ నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలతో రైతులు, ప్రజలందరూ ఆనందంగా ఉండాలని ప్రతీ సంవత్సరం గ్రామంలోని గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం జరుగుతుందని వీడీసీ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: ఇందల్వాయి మండలంలోని గన్నారం, చంద్రయాన్‌పల్లి, తదితర గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఊరపండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ చల్లగా ఉండాలని ప్రతీ సంవత్సరం ఊర పండుగ నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు. ఊరపండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి వనభోజనాలకు వెళ్లారు. ఊర పండుగ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు డిచ్‌పల్లి సొసైటీలో మహాజన సభ

డిచ్‌పల్లి, సెప్టెంబరు 29: ఖిల్లా డిచ్‌పల్లి సహకార సంఘం మహజన సభ నేడు 12గంటలకు చైర్మన్ రాంచందర్ గౌడ్ అధ్యక్షతన జరగనుందని సొసైటీ డైరెక్టర్ సతీశ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో హాజరుకావలని ఆయన కోరారు.

ట్రస్మా ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

● హాజరైన అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలు



ట్రస్మా ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 29: తెలంగాణ రికగ్నైజడ్ స్కూల్‌మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. నగర శివారులోని బృందావన్ గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, భూపతిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డుల జారీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. విద్యార్థుల భవిష్యత్తు గురువులపైనే ఉందని విద్యార్థులను దేశభక్తి పెంపొందేలా తీర్చిదిద్దాలన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం ఉందని విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు ఏ విధంగా అభివృద్ధి చేస్తుందో ప్రైవేటు పాఠశాలలకు కూడా అదే విధంగా అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 250 పాఠశాలల నుంచి 250 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్‌రావు, రాష్ట నాయకులు యాదగిరి శేఖర్‌రావు, రాఘవేంద్రరెడ్డి, జయసింహాగౌడ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిత్యానంద్, అరుణ్, మధు, నర్సింహారావు, మోహన్, శ్రీనివాస్, ధర్మరాజు పాల్గొన్నారు.

ఉచిత హెల్త్‌క్యాంప్‌ను ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే


హెల్త్‌క్యాంప్‌లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే

పెద్దబజార్, సెప్టెంబరు 29: ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న సేవా మహాయజ్ఞంలో భాగంగా ఆదివారం 51వ డివిజన్‌లోని బురుడుగల్లి మేదరి సంఘంలో ఏర్పాటు చేసిన ఉచితవైద్య శిబిరాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భారతమాత ముద్దుబిడ్డ మూడోసారి భారతదేశ ప్రధానిగా సేవలందిస్తున్న నరేంద్రమోదీ నేడు ప్రపంచస్థాయి నాయకునిగా ఎదగడం భారతీయులంతా గర్వించదగ్గ విషయమన్నారు. భారతదేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టాలనే సంకల్పంతో భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తు న్న నరేంద్రమోదీకి బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. హెల్త్‌క్యాంప్‌లో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో రక్త శిబిరం, ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం, పండ్లు, దు ప్పట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరేందర్, లక్ష్మీనారాయ ణ, శ్రీనివాస్, నరేష్, ప్రభాకర్, పవన్, భగత్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి : ట్రాఫిక్ ఏసీపీ



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ

ఖిల్లా, సెప్టెంబరు 29: ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరీక్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ సిబ్బంది ఎన్నో ఒత్తిడిలకు, ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నారన్నారు. ట్రాఫిక్ సిబ్బంది ముఖ్యంగా దుమ్ము, ధూళి వాతావరణంలో పనిచేయాల్సి వస్తుందని అన్నారు. అలాంటి ట్రాఫిక్ సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్యశిబిరంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ సందీప్‌రావు, ఛాతి వైద్యనిపుణులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌లు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్షుడు విజయరామారావు మాట్లాడుతూ ఒత్తిడిలను అధిగమించేందుకు ప్రతిఒక్కరు వ్యాయామంతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, యోగా, ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి గంగారెడ్డి, కార్యనిర్వహణ అధికారి గురుప్రీత్‌సింగ్, పవన్‌పాండే, బాబురావు, జుగేల్ సోని, పార్సిరాజేశ్వర్, గోపాల్‌రెడ్డి, శ్యామ్‌అగర్వాల్, రాజ్‌కుమార్ సుబేదార్, ఆకుల అశోక్, అతుల్ మాంగే, ధీరజ్‌రెడ్డి, జుగల్‌జాజు, సాగర్ మలాని, రామకృష్ణ, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీపరీక్షల్లో పాల్గొనాలి

● ఐపీవో సుస్మితబెనర్జి


సిరికొండలో పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఐపీవో సుస్మితబెనర్జి

సిరికొండ సెప్టెంబరు 29 : విద్యార్థులలో విషయ పరిజ్ఞానం పరీక్షించుకోవడం ద్వారా అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభ సామర్థ్యలను పోటీ పరీక్షలు వెలికి తీస్తాయని తపాల శాఖ నిజామాబాద్ సౌత్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుస్మితబెనర్జీ చెప్పారు. ఆదివారం సిరికొండలో పోస్టల్ శాఖ నిర్వహించిన దీన్‌దయాల్ స్పార్శ్‌యోజన రాష్ట్రస్థాయి జనరల్ నాలెడ్జి పోటీ పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుస్మితబెనర్జీ మాట్లాడాతూ పాఠశాల స్థాయి లో పోటీ పరీక్షలపై పట్టు ఉంటే ఉన్నత స్థాయిలో జరిగే పోటీ పరీక్షలలో పట్టు సాధించడం సులభమని విద్యార్థులకు సూచించారు. తపాల శాఖలో అకౌంట్ ఉన్న విద్యార్థులందరు ఆరునుంచి తొమ్మిదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి ఏడాది పోటీపరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు తపాల శాఖపై అవగాహన, స్టాంపులసేకరణ అలవాటు చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలలో విజేతలైన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించి విద్యార్థులను ప్రోత్సహిస్తుందని ఇన్‌స్పెక్టర్ సుస్మితబెనర్జీ చెప్పారు. కార్యక్రమంలో సబ్‌పోస్టు మాస్టర్లు నవీన్, నితీన్‌రెడ్డి, సృజన్, తపాల శాఖ ప్రతి నిధులు గోపాల్, లింగం, రవి, నరేందర్, పాఠశాల ఉపాధ్యాయు లు గంగారెడ్డి, రవి, శంకర్, శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి'

ఆర్మూర్ రూరల్, సెప్టెంబరు 29: అభివృద్ధిలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్గుల్‌లోని గురడి రెడ్డి సంఘ కల్యాణ మండపంలో ఆర్మూర్ పట్టణ గురడిరెడ్డి సంఘం ఆధ్వర్యంలో మార గంగారెడ్డి, మానాల మోహన్ రెడ్డిలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్‌లు బాధ్యతలు వహిస్తున్న వారివురిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంత అభివృద్ధికి రైతాంగం సమస్యల పరిష్కారానికి తమవంతు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో గురడిరెడ్డి సంఘం నాయకులు పెద్దోల్ల గంగారెడ్డి, ప్రీమియర్ గంగారెడ్డి, విశాఖ గంగారెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్వయం సేవక్ అభివృద్ధికి కృషి చేయాలి

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 29 : విజయదశిమి నాటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న స్వయం సేవక్ సంఘ్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని వక్తలు అన్నారు. ఆదివారం నగరంలోని వివిధ సంఘ్ ఉపనగరంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. విజయదశిమి నాటికి నగరంలోని అన్ని స్వయం సేవక్ కలిసి గణష్ ఉండే విధంగా చూడాలన్నారు. కార్యాలయంలో ప్రతీరోజు సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు గణేష్ వివరాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సత్యం, శ్రీపాద్, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అపహరించిన వ్యక్తి అరెస్టు

ఖిల్లా, సెప్టెంబరు 29: నగరంలోని ఒకటోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పూసలగల్లి ప్రాంతంలో ఎల్.రాం అనే వ్యక్తికి చెందిన సెల్‌ఫోన్ దొంగిలించుకొని పారిపోయినట్లు బాధితుడు ఒకటోటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం షేక్‌ఆరీఫ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. సెల్‌ఫోన్ అపహరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అక్టోబరు 3 నుంచి వాసవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 29: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అక్టోబర్ 3 నుంచి నగరంలోని కిసాన్‌గంజ్‌లోగల వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరుపునున్నామని తెలిపారు. సాయంత్రం 6గంటలకు అమ్మవారి ప్రతిష్ట పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. 4వ తేదీన కన్యక పూజ, అమ్మవారి ఊరేగింపు, 5న నవ చండీ హోమం జరుగుతాయని అన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమ్‌గల్, సెప్టెంబరు 29: ప్రభుత్వ డిగ్రీ కళాశాల భీమ్‌గల్‌లో కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్ సబ్జెక్టులో అతిథి అధ్యాపకులుగా బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ తెలిపారు. పీజీలో 55శాతం కలిగి ఉండి నెట్ సెట్ అలాగే పీహెచ్‌డీ గల అభ్యర్థులు అక్టోబర్ 1వ తేదీ వరకు బయోడెటలను కళాశాలలో అందించాలని తెలిపారు. సమాచారం కోసం 9848581970 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

హైడ్రా తరహాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్

పెద్దబజార్, సెప్టెంబరు 29: జిల్లాలో కూడా హైడ్రా తరహాలోనే వ్యవస్థలను ఏర్పాటు చేయాలని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే క్వాటర్స్‌లో టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ పూలాంగ్ వాగును కాపాడాలని, నడిరోడ్డున గల వాగు నుంచి గాయత్రీనగర్, ముబారక్‌నగర్ వరకు పూర్తిగా అక్రమ నిర్మాణాలతో కబ్జాకు గురైందని తెలిపారు. ఫలితంగా వర్షాకాలంలో చిన్నపాటి వర్షాలకే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నగర శివారులోని నిజామాబాద్, బోధన్ రహదారి పక్కన రామర్తి చెరువు శిఖం కొంత కాలంగా కబ్జాకు గురవుతున్నా పట్టించుకున్న నాథుడే లేడని ఆయన అన్నారు. నాగారంలోని బొందెం చెరువు ఆక్రమణలపై కూడా పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాలని ఆయన వివరించారు

ఉద్యమ నిర్మాణంతోనే కులనిర్మూలన : సీపీఐఎంఎల్

పెద్దబజార్, సెప్టెంబరు 29: విప్లవ ఉద్యమ నిర్మాణంతోనే కుల నిర్మూలన సాధ్యమవుతుందని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా అన్నారు. ఆదివారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో మహాత్మాజ్యోతిబాపూలే జయంతి సందర్భంగా కుల నిర్మూలన వారోత్సవాల భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సాయిబాబా మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే కుల నిర్మూలన కోసం తన జీవితాన్ని అంకితం చేశాడన్నారు. కార్యక్రమంలో నాయకులు పరుచూరి శ్రీధర్, ఎల్బి రవికుమార్, శివకుమార్, రమేష్, సరిత, శంకర్ తదితరులు పాల్గొన్నారు. .

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు పూర్తి


ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 29: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. నగరంలోని నాగారంలో గల రాజారాం స్టేడియంలో ఈ ఎంపికలను నిర్వహించారు. అండర్-14, 16, 18 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేశారు. వారికి బహుమతులను అందజేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్, రాజాగౌడ్‌లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అక్టోబర్ 7, 8 తేదీలలో హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. అండర్-14 విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా జ్యోతిబాపూలే రాంపూర్ కైవసం చేసుకోగా, అండర్-14 బాలికల విభాగంలో కస్తూర్బా బాలికల పాఠశాల ఆర్మూర్ కైవసం చేసుకుంది. అండర్-16 విభాగంలో మహాత్మ జ్యోతిబాపూలే రాంపూర్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు హైదర్ అలీ, ఉపాధ్యక్షులు కపిల్, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్, కోచ్‌శివ, పీఈటీలు సువర్ణ, శ్రీకాంత్, ఉమా, సాయిలు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పాల్గొన్న పూర్వవిద్యార్థులు

సిరికొండ సెప్టెంబరు 29 : సిరికొండ మండలం రామడుగులో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1982 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేశ్వర్, పురుషోత్తం గుప్తా, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, సత్యనారాయణ, సంధ్య, జ్యోతి పాల్గొన్నారు.

రామడుగులో గ్రామదేవతల ప్రతిష్ఠాపన

ధర్పల్లి, సెప్టెంబరు 29: మండలంలోని రామడుగు గ్రామంలో ఆదివారం గ్రామదేవతల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామం నుంచి గ్రామ శివారులోగల ఆయా దేవాలయాల్లో గ్రామదేవతలను డప్పులు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఐదు సంవత్సరాలకొకసారి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవతల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

అక్టోబరు 1న హ్యాండ్‌బాల్ ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 29: ఉమ్మడి జిల్లాల సీనియర్ మహిళ, పురుషుల హ్యాండ్‌బాల్ ఎంపికలు అక్టోబర్ 1న నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగామోహన్ చక్రు, పింజ సురేందర్‌లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు హాజరువాలన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78200	రూ.72100	రూ.940

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : దేవర (11.15, 2.50, 6.25, 10.00)
స్క్రీన్-2 : దేవర (12.15, 3.50, 7.25, 11.00)
స్క్రీన్-3 : మత్తు వదలరా-2 (12.00, 3.00, 6.00, 9.00)
స్క్రీన్-4 : సత్యం సుందరం (11.00, 2.40, 6.20, 10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : దేవర (12.40, 4.00, 7.20, 10.40)
స్క్రీన్-2 : దేవర (10.30)
స్క్రీన్-3 : సత్యం సుందరం (1.30, 4.30, 7.30.)



దేవి : సత్యం సుందరం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : దేవర (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్: దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్